క్లుప్తంగా

పేదలకు రక్షణ ట్రస్ట్ చేయూత



నిత్యావసరాలు అందజేస్తున్న జోష్

ఇల్లెందురూరల్: మామిడిగూడెం గ్రామంలో రక్షణ సేవా ట్రస్ట్ పేద కుటుంబాలకు చేయూతనిస్తోంది. గ్రామంలోని ఎనిమిది కుటుంబాలను దత్తత తీసుకొని వారికి నిత్యావసరాలు, నగదును ట్రస్ట్ వ్యవస్థాపకుడు తమ్మిశ్ల జోష్ బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామంలో పేదల ఆర్థిక స్థితి మెరుగుపడేలా అవసరమైన మేరకు సాయం అందిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ట్రస్ట్ ప్రతినిధులు, గ్రామపెద్దలు తోకల జోసెఫ్, గుడిపెల్లి జాషువా, పాస్టర్ చైర్మన్ డేవిడ్‌రాజు, దయానంద్, హోయేషువా, ఎంఈఓ పిల్లి శ్రీనివాస్, యేసురత్నం, ఇమ్మానియేలు, జాన్ సామెల్, కొరివి జెబాస్టిన్, తోకల సృజన్ పాల్గొన్నారు.

తునికాకు కల్లాల తనిఖీ



తునికాకు కల్లాన్ని తనిఖీ చేస్తున్న ఎఫ్‌డీఓ

పాల్వంచ: మండలంలోని చంద్రాలగూడెం, రేగులగూడెం గ్రామ పంచాయతీల్లో ఏర్పాటు చేసిన తునికాకు కల్లాలను వైల్డ్‌లైఫ్ ఎఫ్‌డీఓ బాబూరావు బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తునికాకు సేకరణను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... సీజన్ మొదలు కావడంతో రెండు రోజుల నుంచి తునికాకు సేకరణ చేపట్టడం జరిగిందని, ఎలాంటి నష్టం చేయకుండా సేకరణ చేయాలని సూచించారు. ఎఫ్‌డీఓ వెంట యానంబైల్ రేంజర్ శ్రీనివాస్, సిబ్బంది ఉన్నారు.

డ్రైవర్‌పై కేసు నమోదు

పాల్వంచ: డివైడర్‌ను టిప్పర్ ఢీకొట్టడంతో డ్రైవర్‌పై కేసు నమోదు అయింది. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని కేశవాపురం వద్ద ఈనెల 10వ తేదీన డివైడర్‌ను, విద్యుత్ పోల్స్‌ను టిప్పర్ ఢీ కొట్టడంతో ధ్వసమయ్యాయి. సుమారు రూ.2.50లక్షల నష్టం జరిగింది. దీంతో పంచాయతీ రాజ్ ఏఈ అనిల్‌కుమార్ బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో టిప్పర్ డ్రైవర్ రవిపై కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపారు.

ఫిజియోథెరపీ సేవలు సద్వినియోగం చేసుకోవాలి



చిన్నారికి థెరపీ చేస్తున్న సునీత

టేకులపల్లి: టేకులపల్లి మండలంలో ప్రతీ బుధవారం నిర్వహించే ఉచిత ఫిజియోథెరపీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని మండల విద్యాశాఖ అధికారి ఠాకూర్ రాంసింగ్ తెలిపారు. ఈ మేరకు బుధవారం మండల కేంద్రంలోని ఓ దివ్యాంగ బాలిక ఇంట్లోనే ఫిజియోథెరపీ నిర్వహించారు. మాట్లాడుతూ... ప్రతీ బుధవారం 18 సంవత్సరాలలోపు దివ్యాంగులకు ఉచితంగా ఫిజియోథెరపీ చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. వివరాలకు 9989724092, 9177794478 నంబర్లకు ఫోన్ చేసి తెలుసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో టేకులపల్లి ఐఈఆర్‌పీ కోఆర్డినేటర్ జే.రవీందర్, ఫిజియోథెరపిస్ట్ బి.సునీత పాల్గొన్నారు.

కొత్త నోటిఫికేషన్ విడుదల చేయాలి

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి యాజమాన్యం పాత నోటిఫికేషన్ ద్వారా ఉద్యోగాల భర్తీకి సిద్ధమవుతున్న నేపథ్యాన అలా కాకుండా పోస్టులు పెంచుతూ కొత్త నోటిఫికేషన్ ఇవ్వాలని హెచ్‌ఎంఎస్ అధ్యక్షుడు రియాజ్ అహ్మద్ ఒక ప్రకటనలో సూచించారు. సంస్థలో ఇటీవల వేల మంది కార్మికులు ఉద్యోగ విరమణ చేయడంతో పాటు కొందరు మెడికల్ ఇన్‌వాలిడేషన్ అయ్యారని తెలిపారు. ఈమేరకు వందల సంఖ్యలో పోస్టులు ఖాళీ ఉన్నాయని తప్పుడు లెక్కలు చూపి, మిగిలిన వాటిని ఇంటర్నల్‌గా భర్తీ చేయాలని చూస్తోందని చెప్పారు. కానీ 70శాతం ఎక్స్‌టర్నల్, 30 శాతం ఇంటర్నల్ పోస్టులు భర్తీ చేయాల్సి ఉన్నందున నిరుద్యోగులు నష్టపోకుండా కొత్త నోటిఫికేషన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే, ఏళ్ల తరబడి కొన్ని విభాగాల్లో పాతుకుపోయిన ఉద్యోగులను బదిలీచేయాలని, సంస్థలో అన్ని ఏసీ అంబులెన్స్‌లను సమకూర్చాలని సూచించారు.

మోడ్రన్ బస్ షెల్టర్లకు గ్రహణం

- అసంపూర్తిగా వదిలేసిన సంస్థ
- అడ్రస్ లేని నిర్వాహకులు
- ఇకనైనా స్పందించాలంటున్న ప్రజలు



మహబూబాబాద్ రోడ్డులో నిరుపయోగంగా మోడ్రన్ బస్ షెల్టర్

ఇల్లెందు: మోడ్రన్ బస్ షెల్టర్లకు గ్రహణం పట్టింది. పట్టణంలో ఆయా సెంటర్లలో ప్రయాణికుల సౌకర్యార్థం ఏర్పాటు చేయతలపెట్టిన బస్ షెల్టర్ల నిర్మాణం అసంపూర్తిగా నిలిచిపోయాయి. ఆరు నెలలుగా ఆ నిర్మాణ సంస్థ అడ్రస్ లేకుండా పోయింది. రూ.లక్షలు ఖర్చు చేసి నిర్మించిన బస్ షెల్టర్లు ఉపయోగంలోకి రాకుండా పోయాయి. అసంపూర్తిగా వదిలేసిన పనులను పూర్తి చేసేందుకు నిర్మాణ సంస్థ సుముఖంగా లేదు. ఇంత ఖర్చు చేసినా ప్రయాణికులకు ఒరిగింది ఏమీ లేదు. ప్రయాణికులు మాత్రం ఇంకా అలానే ఎండకు ఎండి, వానకు తడుస్తూనే ఉన్నారు. బస్ షెల్టర్ల లక్ష్యమే ప్రయాణికులు ఎండకు ఎండ రాదు, వానకు తడువ రాదు. కానీ లక్ష్యం ఎప్పుడు నెరవేరతుందో ఎవరికీ అంతు చిక్కడం లేదు.

అడిగే వారేరీ..?

ఇల్లెందు పట్టణంలో ప్రధాన కూడళ్లల్లో ప్రయాణికులు బస్సుల కోసం ఎదురు చూసే ప్రయాణికుల కోసం నిర్మించ తలపెట్టిన బస్ షెల్టర్లు అసంపూర్తిగా నిలిచిపోయినా అడిగే వారు ఏరీ పలువురు స్థానికులు అంటున్నారు. కలెక్టర్ ప్రియాంక ఆదేశాల మేరకు పట్టణంలో ప్రధాన కూడళ్లల్లో ఎనిమిది బస్ షెల్టర్లను నిర్మాణానికి గడిచిన సెప్టెంబర్‌లో పనులు ప్రారంభించారు. ఎనిమిది నెలలు గడిచినా ఒక్కటీ పూర్తయిన దాఖలాలు లేవు.

పూర్తయితే ప్రయాణికులకు సౌకర్యం..

పట్టణంలోని కరెంట్ ఆఫీస్ వద్ద కొత్తగూడెం వెళ్లే ప్రయాణికులు వేచి ఉండే స్థలంలో ఒక షెల్టర్, ఖమ్మం వైపు వెళ్లే చోట ప్రయాణికులు వేచి ఉండే స్థలంలో మరో బస్ షెల్టర్ నిర్మించారు. ఇక జేకే బస్ స్టాప్‌లో ఒక షెల్టర్ నిర్మాణం, ప్రభుత్వ ఆస్పత్రి వద్ద ఒక షెల్టర్ నిర్మాణాన్ని అసంపూర్తిగా వదిలేశారు. బుగ్గవాగు సెంటర్‌లో ఒక షెల్టర్, గోవింద్ సెంటర్‌లో మహబూబాబాద్ వెళ్లే ప్రయాణికుల కోసం ఒక షెల్టర్, రేల్వే లైన్ దాటిన తర్వాత మహబూబాబాద్ వెళ్లే ప్రయాణికుల కోసం ఒక షెల్టర్, కోర్టు వద్ద గుండాల రోడ్‌లో షెల్టర్ నిర్మాణం చేయాల్సి ఉంది. ఈ షెల్టర్ల నిర్మాణం పూర్తి అయితే ప్రయాణికులకు ఎంతో సౌకర్యంగా ఉంటుంది. బస్టాండ్ వరకు వెళ్లకుండా బస్ వచ్చేవరకు బస్ షెల్టర్ల వద్ద బస్ ఎక్కి వెళ్లే అవకాశం ఉంటుంది.

ఖర్చు ఎక్కువ – ప్రయోజనం తక్కువ..

పట్టణంలోని ప్రధాన కూడళ్లల్లో బస్ షెల్టర్ల నిర్మాణం కోసం రూ.24 లక్షలు ఖర్చు చేయబోతున్నారు. ఒక్కో షెల్టర్‌కు రూ.3.50 లక్షల నుంచి రూ.4 లక్షల వ్యయంతో చేపట్టారు. సీఎంఆర్ సంస్థ తన కంపెనీ యాడ్స్‌ను ఈ బస్‌షెల్టర్‌లకు ఉపయోగించుకునేలా ఆ సంస్థతో నిర్మాణ ఒప్పందం చేసుకుంది. కానీ అవి పూర్తి కావడం లేదు.

బస్సులు నిలిపేలా చూడాలి...



పట్టణంలోని ప్రధాన కూడళ్లల్లో ఎనిమిది బస్ షెల్టర్‌లు ఏర్పాటు చేశారు. కానీ ఒక్క చోట కూడా బస్సులు నిలపడం లేదు. అసంపూర్తి నిర్మాణం వల్ల బస్ షెల్టర్ల వద్ద బస్‌లు ఆగటం లేదు. ప్రయాణికులు మాత్రం ఎప్పటిలానే ఎండలో ఎండుతూ వానకు తడుస్తూ బస్‌ల కోసం వేచి చూస్తున్నారు. – నాయిని సైదులు, ఇల్లెందు

వినియోగంలోకి తీసుకురండి..



ఇల్లెందు పట్టణంలోని ప్రధాన కూడళ్లలో ఏర్పాటు చేసిన బస్ షెల్టర్లను వినియోగంలోకి తీసుకురావాలి. అసంపూర్తిగా ఉండటం వల్ల ప్రయాణికులకు ఉపయోగ పడడం లేదు. ఎండకు ఎండకుండా వానకు తడవకుంగా షెల్టర్ల నిర్మాణం డిజైన్ చేశారు. ఇవి అందుబాటులోకి వస్తే ఉపయోగం.

– కాళంగి హరికృష్ణ, ఇల్లెందు

క్యాంటిన్‌లో భోజన సౌకర్యం కల్పించండి



జీఎం సుధాకర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం కార్పొరేట్ కార్యాలయం (హెడ్డాఫీస్)లో మధ్యాహ్న భోజన సౌకర్యాన్ని పునఃప్రారంభించాలని జీఎం పర్సనల్ (వెల్ఫేర్ అండ్ ఆర్సీ) సామ్యేల్ సుధాకర్‌ను కోరారు. బుధవారం ఆయన చాంబర్‌లో బీఎంఎస్ జాతీయ నాయకుడు పి.మాధవనాయక్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాధవనాయక్ మాట్లాడుతూ.. హెడ్డాఫీస్ క్యాంటిన్‌లో గతంలో కోవిడ్–19 మహమ్మరి రాకముందు అల్పాహారంతో పాటు మధ్యాహ్న భోజనం సరఫరా చేసేవారు, అంతేకాకుండా ఎండాకాలంలో పెరుగు వడ కూడా అందించేవారు కానీ, కోవిడ్ ప్రొటోకాల్‌ను ప్రకారం వాటిని నిలిపివేశారు. ప్రస్తుతం ఓపెన్‌కాస్ట్, భూగర్భ గని కార్మికులకు యాజమాన్యం మధ్యాహ్న భోజన సౌకర్యం కల్పిస్తున్న క్రమంలో హెడ్డాఫీస్‌లోని క్యాంటిన్లలో మధ్యాహ్న భోజన సదుపాయం కల్పించాలని కోరారు. స్పందించిన జీఎం సమస్యను సంస్థ ఉన్నతాధికారులకు దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జీవీ కృష్ణారెడ్డి, సుందర్‌రావు, రామ్‌సింగ్, పిల్లి రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

శ్రీకృష్ణ కుటుంబానికి అండగా ఉంటాం..



నివాళి అర్పిస్తున్న చంద్రశేఖర్‌రావు

చుంచుపల్లి: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పరిషత్ కార్యాలయం సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తూ పార్లమెంట్ ఎన్నికల విధుల్లో భాగంగా అశ్వారావుపేటలో ఆకస్మికంగా గుండెపోటుతో మరణించిన పోలూరు శ్రీకృష్ణ కుటుంబానికి అన్నివిధాలుగా అండగా నిలుస్తామని జెడ్పీ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్‌రావు అన్నారు. బుధవారం ఖమ్మంలోని ఆయన స్వగృహంలో శ్రీ కృష్ణ భౌతికకాయానికి నివాళులర్పించి, కుటుంబ సభ్యులకు సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్మన్ మాట్లాడుతూ.. శ్రీకృష్ణ జిల్లా పరిషత్ కార్యాలయంలో అంకితభావంతో పనిచేయడమే కాకుండా క్రమశిక్షణ కలిగిన ఉద్యోగిగా అందరి మన్ననలు అందుకున్నారన్నారు. ఆయన ఆకస్మిక మరణం కుటుంబ సభ్యులకే కాకుండా జిల్లా ప్రజా పరిషత్‌కు కూడా తీరని లోటన్నారు. ప్రభుత్వం నుంచి వారి కుటుంబ సభ్యులకు రావాల్సిన బెనిఫిట్స్ అందజేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ సీఈఓ ప్రసూన రాణి, డిప్యూటీ సీఈఓ చంద్రశేఖర్, సూపరింటెండెంట్ శ్రీనివాస్, అరుణ, పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.రాజేష్, స్టేట్ కౌన్సిలర్ వై.శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

పనిచేయని సీపీఆర్ఎంఎస్ మిషన్



సింగరేణి ప్రధాన కార్యాలయ ముఖద్వారం

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి వ్యాప్తింగా ఉన్న 11 ఏరియాల్లో రిటైర్డ్ కార్మికులు సీపీఆర్ఎంఎస్ స్కీం కింద రూ.40 వేలు కడితే అనంతరం భార్యభర్తలకు కలిపి రూ.8 లక్షల వరకు మెడికల్ ట్రీట్‌మెంట్ తీసుకోవచ్చురు. ఈ ట్రీట్‌మెంట్ తీసుకోలంటే వారికి సీపీఆర్ఎంఎస్ కార్డ్ ఉండాలి. ఈ కార్డ్ ప్రింట్ చేసే మిషన్ రిపేరుకు రావటంతో రిటైర్డ్ కార్మికులు ఇబ్బంది పడుతున్నారు. ఇటీవల జిల్లాలో రెండుసార్లు భారీగా పెనుగాలులు వీశాయి. ఈ సమయంలో మిషన్ ఉన్న రూమ్‌పై సీలింగ్ పడిపోయి, గాలిదుమారం, వర్షం నీరు పడి కార్డ్ ప్రింటింగ్ మిషన్ పనిచేయటం లేదు. సుమారు రూ.3.5 లక్షలు ఖర్చు చేసి మిషన్‌కు సరైన రక్షణ ఏర్పాటు చేయకపోటం వలన ఈ పరిస్థితి నెలకొంది. అయితే అంతకంటే ముందు ఒక మిషన్‌లో చిన్న రిపేర్ (మిషన్‌లో ఒక రబ్బర్) చెడిపోవటంతో ఆ మిషన్ కొన్ని సంవత్సరాలుగా మూలన పడేశారు. ఇప్పుడు కార్డ్ ప్రింట్ చేసే మిషన్ చెడి పోయింది. ఈ నేపథ్యంలో బయట ఏదో ఒక షాపులో కార్డ్‌లు ప్రింట్ చేయాల్సిన అధికారుల నిర్లక్ష్యం చేస్తున్నారు. ఈ కారణంగా సుమారు 200కు పైగా సీపీఆర్ఎంఎస్ కార్డ్‌లు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ కార్డ్‌లు ఉంటేనే ప్రైవేట్ ఆస్పల్లో చికిత్స చేస్తారు. కానీ ఈ కార్డ్‌లేక కార్మికులు ఆస్పత్రుల్లో రూ.వేలు చెల్లించాల్సి వస్తోందని కార్మికులు వాపోతున్నారు. ఇదిలా ఉండగా ఈ ఏడాది ఏప్రిల్ 30న ఈ విభాగం (వెల్ఫేర్) జీఎం కట్టా బసవయ్య ఉద్యోగ విరమణ పొందారు. 15 రోజులుగా ఆయనకు కూడా సీపీఆర్ఎంఎస్ కార్డ్ ఇవ్వకపోవడం విచారకరం. అధికారులైతే ఏదో ఒకటి చేసి ఆస్పత్రి పైఅధికారులతో చెప్పించుకొని ట్రీట్‌మెంట్ చేయించుకుంటారు. కానీ కార్మికుల విషయంలో ఏ అధికారీ చెప్పరు. ఈ నేపథ్యంలో కార్మికుల పరిస్థితి ఏంటని పలువురు కార్మికులు ప్రశ్నిస్తున్నారు. మిషన్ రిపేరుకు వస్తే ఐటీ విభాగం అధికారులు ఏం చేస్తున్నారని, ఏవరికైనా అత్యవసర పరిస్థితి వస్తే ఏంటని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ఐటీ అధికారులు స్పందించి సీపీఆర్ఎంఎస్ మిషన్‌కు మరమ్మతులు చేయాలని కోరుతున్నారు.

'నిజమైన కాంగ్రెస్ వాదులకు ఇబ్బందులు'



మాట్లాడుతున్న శౌరి

కొత్తగూడెంరూరల్: కొత్తగూడెం నియోజకవర్గంలో నిజమైన కాంగ్రెస్ వాదులకు ఇబ్బంది ఎదురవుతోందని టీపీసీసీ సభ్యుడు, రాష్ట్ర ఎస్సీ సెల్ కన్వీనర్ జేబీ శౌరి అన్నారు. కాంగ్రెస్ జిల్లా కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇటీవల లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి సహకరించిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థికి నియోజకవర్గంలో 60 వేల ఓట్ల మెజారిటీ వస్తుందని చెప్పారు. కాగా నియోజవర్గంలో నిజమైన కాంగ్రెస్ శ్రేణులకు ప్రాధాన్యం ఇవ్వక పోగా, భవిష్యత్‌లో ఇది ఇబ్బందికరమైన పరిస్థితికి దారి తీసే అవకాశముందని చెప్పారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీని కాదని బయటికి వెళ్లినవారు తిరిగి ఇప్పుడు మళ్లీ పార్టీలో చేరి పెత్తనం చెలాయిస్తున్నారని ఆరోపించారు. మొదటి నుంచి పార్టీలో ఉండి జెండా మోసిన వారిని పట్టించుకోవడం లేదని వాపోయారు. ఈ సమావేశంలో కాంగ్రెస్, అనుబంధ సంఘాల నాయకులు గడ్డం రాజశేఖర్, అజ్మీరా సురేష్‌నాయక్, జయప్రకాష్, మెహమ్మద్ ఉస్మాన్, షబానా, ఏలూరు రాందాస్ తదితరులు ఉన్నారు.

గ్యాస్ ప్రమాదాలను నివారించండి..

పాల్వంచ: గ్యాస్ ప్రమాదాలు జరగకుండా తగు జాగ్రత్త చర్యలు పాటించాలని పాల్వంచ హెచ్‌పీ గ్యాస్ మేనేజర్ అనంతుల లక్ష్మీ నారాయణ అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. సురక్ష పైపు, రెగ్యులేటర్, స్టవ్‌ను ఎప్పటికప్పుడు సరిచూసుకోవడంతో పాటు, పాడైతూ కొత్తది అమర్చుకోవాలని, అమర్చినందుకు రూ.150 చెల్లించాల్సి ఉంటుందని చెప్పారు. ఇలా చేయించుకోవడం ద్వారా అనుకోకుండా గ్యాస్ లీకేజ్ వల్ల ఏదైనా ప్రమాదం సంభవిస్తే సంస్థ నిబంధనల మేరకు తగు నష్టానికి ఇన్సూరెన్స్ ద్వారా సహాయం అందుతుందన్నారు. 30వ తేదీలోగా పైపు మార్చుకోవాలని, ఈ కేవైసీ తప్పనిసరిగా గ్యాస్ డెలివరీ బాయ్‌తో చేయించుకోవాలని, ఏమైనా ఇబ్బందులు ఉంటే గ్యాస్ కార్యాలయాన్ని సంప్రదించాలని కోరారు.

బోరు బండి సీజ్



లారీని నిలిపివేసిన టాస్క్‌ఫోర్స్ అధికారులు

టేకులపల్లి: టేకులపల్లి మండలంలో బోరు బావి తవ్వకాలు ఇష్టారాజ్యంగా జరుగుతున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా ఎలాంటి అనుమతులు లేకుండా ఎక్కడ పడితే అక్కడ బోరు తవ్వకాలు చేస్తున్నారు. ఈ మేరకు బుధవారం టాస్క్‌ఫోర్స్ అధికారులు మండలంలో దాడులు నిర్వహించారు. డీఎఫ్ఓ సమాచారం మేరకు టేకులపల్లి మండలం తడికలపూడి రోడ్‌లోని ఆర్ఎఫ్ భూమిలో రేగుల తండాకు చెందిన ఓ వ్యక్తి ఆధ్వర్యంలో ఎలాంటి అనుమతులు లేకుండా బోరు తవ్వకం చేపడుతుండటంతో జిల్లా టాస్క్‌ఫోర్స్ అధికారులు ఆకస్మికంగా దాడులు చేశారు. వివరాలు నమోదు చేసుకుని బోరు బండిని సీజ్ చేసి పోలీసుస్టేషన్‌కు తరలించారు. బోరు బండి యజమాని ఎవరు, బండిని ఎవరు నిర్వహిస్తున్నారు, భూమి యజమాని ఎవరు తదితర వివరాలు సేకరిస్తున్నామని, కేసు దర్యాప్తు చేస్తున్నామని టాస్క్‌ఫోర్స్ అధికారి ప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఆర్ఓ ముఖ్తార్ హుస్సేన్, ఎఫ్ఎస్ఓ కోటేశ్వరరావు, లక్ష్మీ నారాయణ, ఎఫ్‌బీఓలు రాములు, రాఘవ తదితరులు పాల్గొన్నారు.

కనీస వేతనాలు చెల్లించండి..



మాట్లాడుతున్న రాంచందర్‌నాయక్

టేకులపల్లి: జీఓ నంబర్ 22 ప్రకారం కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతనాలు తక్షణమే చెల్లించాలని సీపీఐ జిల్లా నాయకుడు గుగులోత్ రాంచందర్ నాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం మండల కేంద్రంలో జరిగిన యూనియన్ సమావేశంలో ఆయన మాట్లాడారు. సింగరేణి రోడ్ క్లీనింగ్ వర్కర్స్ యూనియన్ కాంట్రాక్ట్ కార్మికులకు మార్కెట్‌లో నిత్యావసర వస్తువుల ధరలను పరిగణనలోకి తీసుకుని 16 సంవత్సరాల నుంచి వేతనాలను పెంచకపోవడం వల్ల జరిగిన నష్టాన్ని ఆలోచించి శాస్త్రీయంగా కనీస వేతనాలను నిర్ణయించాలని కోరారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం కార్మిక శాఖ ద్వారా విడుదల చేసిన నోటిఫికేషన్‌లో పొందుపరిచిన వేతనాల ప్రతిపాదన సక్రమంగా లేదని తక్షణమే దానిని ఉపసంహరించుకోవాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం సింగరేణి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) సింగరేణి రోడ్ క్లీనింగ్ వర్కర్స్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గుగులోతు రామారావు, ఉపాధ్యక్షుడిగా భూక్యా ప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా వాసం భద్రయ్య, సహాయ కార్యదర్శిగా అజ్మీరా రాంబాబు, కోశాధికారిగా గుగులోతు బుజ్జిలను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ మండల వైస్ ప్రెసిడెంట్ అయిత శ్రీరాములు, ఈసం నరేష్, లకావత్ శివ, వాసం నరేందర్, బానోత్ బాలు, ఈసం ప్రభాకర్, రాంబాబు, ఉప్పయ్య తదితరులు పాల్గొన్నారు.

మండుటెండలో చల్లని నీడ



టేకులపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఎదురుగా చెట్టు నీడకు చేరిన పశువులు

నిండు వేసవిలో ఎండ తీవ్రత మండుతోంది. చిన్నపెద్దా తేడా లేకుండా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మూగజీవాలు సైతం ఎండను తాళలేకపోతున్నాయి. ఈ క్రమంలో మేతకు వెళ్లిన కాసేపటికే రోడ్ల వెంబడి ఉన్న చెట్ల నీడలో సేద తీరుతున్నాయి. బోడు రోడ్‌లో ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఎదురుగా ఉన్న మైదానంలోని చెట్టు నీడలో బుధవారం మూగజీవాలు సేద తీరుతున్న దృశ్యాన్ని సాక్షి కెమెరా క్లిక్ మనిపించింది. – టేకులపల్లి

విద్యుత్ సబ్‌స్టేషన్‌లో సోలార్ యూనిట్

- డివిజన్‌లో సుభాష్‌నగర్ సబ్‌స్టేషన్‌కు అవకాశం
- సమగ్ర నివేదికతో ప్రతిపాదించిన ట్రాన్స్‌కో అధికారులు



సుభాష్‌నగర్ విద్యుత్ సబ్‌స్టేషన్

ఇల్లెందురూరల్: ప్రస్తుతం విద్యుత్ అవసరాలు రోజురోజుకు పెరుగుతున్నాయి. డిమాండ్‌కు తగినట్లుగా ఉత్పత్తి లేకపోవడంతో భారమైనా ప్రభుత్వానికి విద్యుత్ కొనుగోలు చేయక తప్పని పరిస్థితి. దీనికి తోడు రాయితీ పథకాలతో ప్రభుత్వానికి విద్యుత్ సరఫరా ఆర్థికంగా భారంగా మారుతోంది. ఇటువంటి పరిస్థితిలో ప్రభుత్వం ప్రత్యామ్యాయం దిశగా అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా తక్కువ ఖర్చుతో విద్యుదుత్పత్తి చేయాలన్న సంకల్పంతో ట్రాన్స్‌కో ఆధ్వర్యంలో సోలార్ ప్లాంట్ల ఏర్పాటు చేయనుంది.

కేంద్ర ప్రభుత్వ రాయితీతో..

గతంలో సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం రాయితీ అవకాశం కల్పించిన సమయంలో గృహ, వ్యవసాయ అవసరాలకు చాలామంది సోలార్ ప్లాంట్లు విరివిగా ఏర్పాటు చేసుకున్నారు. కానీ రాయితీని కేంద్ర ప్రభుత్వం రద్దు చేయడంతో ప్లాంటు ఏర్పాటు భారంగా భావించి చాలామంది వెనకడుగు వేశారు. కానీ సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేసుకునేందుకు కేంద్ర ప్రభుత్వం తాజాగా రాయితీ ఇస్తుండటంతో ఆ దిశగా చాలామంది అడుగులు వేస్తున్నారు. ఈ క్రమంలో ఇప్పటికే ప్రభుత్వ పాఠశాలలు, కార్యాలయాలలో విద్యుత్ వినియోగ భారం తగ్గించుకునేందుకు సోలార్ ప్లాంట్లను ప్రభుత్వం ఏర్పాటు చేస్తోంది. ఇంతేకాకుండా గృహ విద్యుత్‌కు కూడా యూనిట్లు మంజూరు చేస్తోంది. స్వచ్ఛందంగా ముందుకొచ్చే పొదుపు సంఘాలకు సైతం సోలార్ యూనిట్ ఏర్పాటుకు అవకాశం కల్పిస్తోంది.

సుభాష్‌నగర్‌లో ఏర్పాటుకు ప్రతిపాదన...

రాష్ట్రంలో విద్యుత్ అవసరాలు క్రమంగా పెరుగుతూ వస్తున్నాయి. ప్రస్తుత వేసవిలో భానుడు తన ప్రతాపం చూపిస్తుండటంతో విద్యుత్ వినియోగం సాధారణ డిమాండ్ కంటే రెట్టింపు స్థాయిలో ఉంటోంది. దీనికితోడు రాష్ట్ర ప్రభుత్వం ఆరు గ్యారెంటీలలో భాగంగా గృహాలకు 200 యూనిట్ల లోపు విద్యుత్‌ను వినియోగించుకునే వారికి ఉచితంగా సరఫరా చేస్తోంది. అంతేకాకుండా వ్యవసాయానికి 24 గంటలు ఉచిత విద్యుత్ సరఫరా వంటివి ప్రభుత్వానికి భారంగా మారింది. ఈ సమస్యను అధిగమించేందుకు సోలార్ విద్యుత్ ఉత్పత్తిని ప్రోత్సహిస్తే మరింత ప్రయోజనం ఉంటుందని భావించిన రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన పీఎం కుసుమ్ పథకం ద్వారా సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా విద్యుత్ సబ్‌స్టేషన్లలో సోలార్ ప్లాంట్ ఏర్పాటుకు అవసరమైన స్థలం, అనువైన వాతావరణం, అధిక ఉష్ణోగ్రత నమోదు. వంటి అంశాలను ప్రామాణికంగా తీసుకొని ఆయా ప్రాంతాలలో సోలార్ యూనిట్ ప్లాంట్లు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం తాజాగా నిర్ణయించింది. దీనికోసం కొత్తగూడెం డివిజన్‌లో అనువైన సబ్‌స్టేషన్ల పరిశీలన ప్రారంభించారు.

ఇల్లెందు నియోజకవర్గం పరిధిలోని సుభాష్‌నగర్ సబ్‌స్టేషన్, అశ్వారావుపేట నియోజకవర్గంలోని అంకంపాలెం గ్రామాలు నిర్దేశిత ప్రమాణాలు కలిగి ఉండటంతో ఆయా చోట్ల సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేయాలని ట్రాన్స్‌కో అధికారులు నిర్ణయించారు. అయితే అంకంపాలెంలో 132 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ మంజూరు కావడంతో అక్కడ స్థలాభావం సమస్య ఎదురువావడంతో డివిజన్‌లో ఇల్లెందు మండలం సుభాష్‌నగర్ సబ్‌స్టేషన్‌ను మాత్రమే ఎంపిక చేసి ప్రతిపాదన పంపారు.

నిర్మాణ వ్యయం ఇలా..

సోలార్ ప్లాంట్ల నిర్మాణం సాధారణంగా భారంగానే ఉంటుంది. కేంద్ర ప్రభుత్వం కల్పిస్తున్న రాయితీ సౌకర్యం వల్ల కొంతమేర ఖర్చు తగ్గుతుంది. ఒక ఎకరం స్థలంలో 650 కిలోవాట్ విద్యుత్‌ను ఉత్పత్తి చేసేలా సోలార్ ప్లేట్లను అమర్చుతారు. సుభాష్‌నగర్ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో 1.25 ఎకరాల స్థలం అందుబాటులో ఉండటతో రోజుకు 800 కిలోవాట్ల విద్యుత్ ఉత్పత్తి చేసే అవకాశం ఉంటుంది. అయితే ఒక కిలోవాట్ విద్యుదుత్పత్తి చేసేందుకు అవసరమైన ప్లేట్లు బిగించేందుకు, ఇతరత్రా సామగ్రికి రాయితీ పోను రూ.80 వేలు ఖర్చు వస్తుందని అధికారులు చెబుతున్నారు.

తుది దశకు టెండర్ ప్రక్రియ..

సోలార్ ప్లాంటు ఏర్పాటుకు కోసం ట్రాన్స్‌కో ప్రతిపాదించిన సుభాష్‌నగర్ విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ఉన్నతాధికారులు ఇప్పటికే పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అయితే ప్లాంటు నిర్మాణానికి సంబంధించి ప్రక్రియ టెండర్ దశకు చేరుకోవడం, నిర్వహణకు ఎటువంటి నిర్ణయం తీసుకోకపోవడంతో కొంత జాప్యం జరుగుతోందని అధికారులు అభిప్రాయపడుతున్నారు. ఇదిలా ఉండగా సోలార్ ప్లాంట్లలో ఉత్పత్తి అయిన విద్యుత్‌ను గ్రిడ్‌కు విక్రయించేలా ఇప్పటికే ఉన్నతాధికారులు కార్యాచరణ రూపొందించడం గమనార్హం.



ఇల్లెందు సబ్‌డివిజన్ ట్రాన్స్‌కో కార్యాలయం

యువతలో సరికొత్త ఆశలు..

వనరులు పుష్కలంగా ఉన్నా చెప్పుకోవడానికి ఒక ఉపాధి వనరు కూడా లేకపోవడంతో మండలంలో యువత ఇతర ప్రాంతాలకు వలస పోవాల్సిన పరిస్థితి నెలకొంది. ఇటువంటి సమయంలో సుభాష్‌నగర్‌లో ట్రాన్స్‌కో ఆధ్వర్యంలో సోలార్ ప్లాంట్ ఏర్పాటు ప్రతిపాదన చేయడంతో యువతలో కొత్త ఆశలు చిగురించాయి. కొంత మందికైనా ఉపాధి అవకాశాలు కలుగుతాయని హర్షం వ్యక్తం చేస్తోంది.

ప్రతిపాదనలు పంపించాం...

మండలంలోని సుభాష్‌నగర్ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో సోలార్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రం ఏర్పాటుకు వనరులు, అవకాశాలు మెండుగా ఉండటంతో ప్రతిపాదనలు పంపించాం. సంబంధిత అధికారులు సైతం పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. టెండర్ ప్రక్రియ పూర్తయితే నిర్మాణం, ఆ వెంటనే ఉత్పత్తి ప్రక్రియ ప్రారంభమవుతుంది.

– నందయ్య, డీఈ, ట్రాన్స్‌కో కొత్తగూడెం డివిజన్